క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: రుణాలను సద్వినియోగం చేసుకుని పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైకేపీ ఏపీఎం వెంకటస్వామి సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రుణాల వినియోగంపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పొదుపు మహిళలకు బ్యాంక్‌ల ద్వారా, స్త్రీ నిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా రుణాలను అందిస్తుందన్నారు. వీటిని వినియోగించుకుని ఆర్థికంగా బలపడాలన్నారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంక్‌ల అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో సీసీలు రాముడు, మారెన్న, నరసింహుడు, నాగేంద్ర ఉన్నారు.

అడిగిన వారందరికీ పనులు



పనులను పరిశీలిస్తున్న పీడీ అమరనాథరెడ్డి

కోడుమూరు: అడిగిన వారందరికీ పనులు చూపించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని పీడీ అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ కూలీలతో మాట్లాడుతూ పనికి తగిన వేతనం అందుతుందా అని, పని చేసిన ప్రాంతాల్లో తాగు నీరు, చలువ పందిళ్లు తదితర వసతులు ఏర్పాటు చేస్తున్నారా అని ఆరా తీశారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. పీడీ వెంట ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ రమికుమారు, ఫీల్డ్ అసిస్టెంట్ నంద్యాల శీను ఉన్నారు.

20 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

కోడుమూరు: మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో రైతు మస్తాన్ పొరపాటున పురుగు మందు తాపడంతో 22 గొర్రెలు మృతిచెందగా మరో 40 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటన ఈనెల 19న జరిగింది. ఏడీఏ రామసుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అంబులెన్స్‌లో పశువైద్య సిబ్బంది క్రిష్టాపురం గ్రామానికి వెళ్లి అస్వస్థకు గురైన గొర్రెలకు చికిత్స చేశారు. రోగ నివారణకు వాడే మందులు, పొలాలకు వాడే వివిధ క్రిమిసంహారక మందులను మస్తాన్ తన ఇంట్లో ఒకేచోట పెట్టుకున్నాడు. పొరపాటున గొర్రెల రోగ నివారణ మందు అనుకొని క్రిమిసంహారక మందును నీళ్లలో కలిపి తాపించాడు. దీంతో 22 గొర్రెలు మృతి చెందాయి. సోమవారం ఏడీఏ రామసుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మిగిలిన 40 గొర్రెలకు చికిత్స చేశారు.

పంటల పరిశీలన



గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడు సమీపంలో రైతులు సాగు చేసిన పంటలను సోమవారం వ్యవసాయ అధికారులు శ్రీవర్ధన్‌రెడ్డి, శిధర్‌రెడ్డి పరిశీలించారు. ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందిస్తున్నాయా లేదా అని రైతులను అడిగితెలుసుకున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమసయంలో పరిహారం అందుతుందని వారు వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఆర్‌జేడీని కలసిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లలితమ్మ తదితరులు ఉన్నారు.

సిటీ బస్సులు నడపాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో సిటీ బస్సులు నడపాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు కోరారు. ఈమేరకు ఆయన సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, కలెక్టర్, ఆర్టీసీ రీజినల్ మేనజర్‌కు వినతిపత్రాలు పంపినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సిటీ బస్సుల ఏర్పాటుతో పేద, మధ్యత రగతి ప్రజలకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు.

పంచాయతీకి పన్నుపోటు

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా వసూలు కాని పన్నులు
- పట్టించుకోని సిబ్బంది
- పంచాయతీలో నిలిచిపోతున్న అభివృద్ధి



కోడుమూరు గ్రామపంచాయతీ కార్యాలయం

పంచాయితీ	వసూలు కావాల్సిన పన్ను	వసూలైన పన్ను	శాతంలో..
అమడగుంట్ల	రూ.55,020	రూ.27,110	49.27
అనుగొండ	రూ.98,027	రూ.58,927	60.11
గోరంట్ల	రూ.1,11,300	రూ.62,510	56.16
కల్లపరి	రూ.44,779	రూ.23,469	52.41
కోడుమూరు	రూ.55,42,520	రూ.35 లక్షలు	75
ఎర్రదొడ్డి	రూ.66,134	రూ.24,844	37.57
ముడుమలగుర్తి	రూ.85,000	రూ.55,550	65.35
క్రిష్టాపురం	రూ.55,000	రూ.38,860	70.65
వర్కూరు	రూ.1,38,600	రూ.82,290	59.37
లద్దగిరి	రూ.2,20,500	రూ.1,28,230	58.15
వెంకటగిరి	రూ.72,350	రూ.57,100	78.92
ప్యాలకుర్తి	రూ.1,50,000	రూ.1,16,509	77.67
పులకుర్తి	రూ.2,23,590	రూ.87,990	39.35
మొత్తం	రూ.67,51,520	రూ.42,63,389	59.99

కోడుమూరు: ఆర్థిక సంవత్సరం మరో నెలరోజుల్లో ముగియనుంది. అయినా ఇంటి పన్ను వసూళ్లలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పంచాయతీల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కోడుమూరు మేజర్ పంచాయతీలో మాత్రమే కొంచెం మెరుగ్గా ఉంది. ఇక్కడ పాత బకాయిలతో కలిపి రూ.55.042 లక్షలు వసూలు కావాల్సి ఉండగా రూ.35 లక్షలు వసూలైంది. మిగతా బకాయిలను మార్చి నెలఖరులోపు వసూలు చేస్తామని మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉన్నతాధికారులను గడువు కోరినట్లు సమాచారం. కల్లపరి గ్రామానికి మాత్రమే పంచాయతీ సెక్రటరీ లేరు. మిగతా 12 పంచాయతీలకు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నా పన్ను వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మార్చి చివారినాటికి వంద శాతం పన్ను వసూలు చేయాల్సి ఉన్నా ఏ ఒక్క పంచాయతీలో కూడా 50 శాతం చేరుకోకపోవడం చూస్తే సిబ్బంది పనితీరును తేటతెల్లమవుతోంది.

100 శాతం వసూలు చేస్తాం

కోడుమూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మార్చి నెలాఖరుకు ఇంటి పన్ను వసూళ్లను 100 శాతం లక్ష్యం సాధిస్తాం. ఇప్పటివరకు 59 శాతం పన్ను వసూలైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వసూళ్లపై దృష్టిసారించాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. – మంజుల, ఈఓఆర్డీ

ఎన్నికల నిర్వహణపై జాగ్రత్తలు వహించాలి

సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అధికారులు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీఓ రాముడితో కలిసి మండల ఎన్నికల నిర్వహణ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నాయకుల కార్యక్రమాలు, పర్యటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కల్లూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో స్టడీ అవర్‌ను పరిశీలించారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయందోళనలను, అపోహలను తొలగించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.

'నారాయణ' లెక్చరర్ అదృశ్యం



అసదుల్లా బేగ్

కర్నూలు(సిటీ): నారాయణ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అసదుల్లా బేగ్ అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆయన భార్య షమీన్ ఉబ్రా సోమవారం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 17వ తేదీన గాయత్రి ఎస్టేట్‌లోని జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు క్లాస్ బోధిస్తుండగా ఇద్దరు విద్యార్థులు పట్టించుకోకుండా మాట్లాడుతుండటంతో వారిని హెచ్చరించారు. ఈ విషయంలో సదరు లెక్చరర్‌పై ఆ విద్యార్థులు తిరగబడి చేయి చేసుకున్నారు. దీనిపై కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కాలేజ్ నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి తన భర్త కనిపించడం లేదని కాలేజీ నిర్వాహకులకు అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్

కర్నూలు: స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జొహరాపురంలో నివాసముంటున్న ఐదుగురు పాత నేరస్తులను బైండోవర్ కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కర్నూలు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. జొహరాపురానికి చెందిన చంద్రకంటి లక్ష్మమ్మ, ఇజ్రాయేల్, గద్దెపోగు శ్రీను, మల్లెపోగు నరేష్, అచ్చెమ్మ తదితరులపై గంజాయి కేసులు ఉన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వీరు మళ్లీ గంజాయి వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

ఇద్దరి వ్యక్తులకు గాయాలు

క్రైమ్ కార్నర్

కర్నూలు సిటీ: మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేసి ఇద్దరిని గాయపరిచాడు. సోమవారం రాత్రి రోజా వీధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చందు అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి రోజా వీధిలో స్థానికులపై హల్‌చల్ చేశారు. వారు ప్రతిఘటించగా రాళ్లు రువ్వాడు. ఈ ఘటనలో సలీమ్, అబ్దుల్లా అనే ఇద్దరు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా అధికారులకు ఆదేశించారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. సోమవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. జాబితాలో డూప్లికేట్, అర్హత లేని వారికి ఓటు ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్‌లోని బ్యాలెట్ బాక్సుల భద్రతా, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తదితర అంశాలపై సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఫామ్-7, పట్టభద్ర నియోజకవర్గానికి సంబంధించి ఫామ్-8లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి 28వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎన్నిలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి 24 గంటల్లో పరిష్కారాలు చూపాలన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ మార్పు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. జిల్లాలోని పరిస్థితులను డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. జిల్లాలో ఓటర్ల దరఖాస్తులు పెండింగ్‌లో లేకండా చర్యలు తీసుకున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగరాజు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఈడీ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

కర్నూలు సిటీ: మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేసి ఇద్దరిని గాయపరిచాడు. సోమవారం రాత్రి రోజా వీధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చందు అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి రోజా వీధిలో స్థానికులపై హల్‌చల్ చేశారు. వారు ప్రతిఘటించగా రాళ్లు రువ్వాడు. ఈ ఘటనలో సలీమ్, అబ్దుల్లా అనే ఇద్దరు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఉత్సవమూర్తుల పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

హరహర మహాదేవ!



భక్తుల మధ్య సాగుతున్న భోగేశ్వరుడి రథోత్సవం

- రమణీయంగా సాగిన బుగ్గ రామేశ్వరుడి రథోత్సవం
- తరలివచ్చిన భక్తజనం

ఓర్వకల్లు: హరహర మహాదేవ!.. శంభోశంకర!! నినాదాల మధ్య కాల్వ బుగ్గ రామేశ్వరుడి రథోత్సవం సోమవారం కడు రమణీయంగా సాగింది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం భ్రమరాంబ, బుగ్గ రామేశ్వర స్వాముల రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రథానికి పూజలు చేసి, ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. అర్చకులు రథాంగపూజ, హోమం నిర్వహించారు. తర్వాత ఆదిదంపతులను పల్లకీలో కొలువుంచి భాజాభజంత్రీలతో రథశాల వద్దకు చేర్చారు. అమ్మవారి పల్లకీని ఎమ్మెల్యే భుజాలపై మోసుకెళ్లారు. అంతకుముందు నన్నూరు గ్రామంలో నిర్వహించిన భవానీ సమేత నాగేశ్వరస్వాములను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రథానికి సర్పంచు బ్రహ్మయ్య, చెన్నారెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కాల్వబుగ్గ దేవస్థానంలో అప్పటికే సిద్ధం చేసిన రథంపైకి స్వామిఅమ్మవార్లను తీసుకెళ్లి ఆసీనులగావించారు. అనంతరం ఓం నమఃశివాయ, శంభోశంకర, హరహోం హర అంటూ భక్తులు రథాన్ని ముందుకు కదిలించారు. స్వాముల రథంపైకి పూలు, పండ్లు విసురుతూ భక్తులు తన్మయత్వం పొందారు. బసవన్న మండపం వరకు లాక్కెళ్లి.. అక్కడి నుంచి తిరిగి రథశాలకు చేర్చారు. భక్తులు రథోత్సవాన్ని తిలకించి పరవశించిపోయారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణశర్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా భోగేశ్వరుడి రథోత్సవం

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి రథోత్సవం సోమవారం వైభవంగా సాగింది. ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సమూర్తులను రథంపై కొలువుంచి అలంకరించారు. రథం ముందు యువకుల నందికోలు నాట్యం, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు స్వామివారికి అభిషేకం, ధూపదీప నైవేద్యం, బలిహరణ తదితర విశేష పూజలు నిర్వహించారు. రథోత్సవంలో స్వామి వారిని దర్శించుకుని పరవశించిపోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తుల కోలాహలం, కళాకారుల ప్రదర్శన మధ్య స్వామి రథాన్ని లాగారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి ఆరు పళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. పాణ్యం మండలం భీరం బుల్స్ అధినేత భీరం సుబ్రమణేశ్వర ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.40 వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. రెండవ బహుమతి చెరుకులపాడు రామాంజనేయులు వృషభాలు(రూ.30 వేలు), మూడవ బహుమతి పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన భీరం బుల్స్ (రూ.20 వేలు), నాల్గవ బహుమతిని గడివేముల మండలం గడిగరేవుల గ్రామానికి చెందిన వెంకట సుబ్బరాయుడు ఎద్దు(రూ.10 వేలు) దక్కించుకున్నాయి.

ముగిసిన పాణికేశ్వరుడి ఉత్సవాలు

పాణ్యం: మహాశివరాత్రి సందర్భంగా నాలుగు రోజులుగా పాణ్యంలో సాగిన శ్రీ పాణికేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ లక్ష్మీనారాయణ పాట పడి భక్తులను ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చివరి రోజు స్వామి ఆలయం ప్రాంగణంలో భక్తుల వినోదానికి రేలారె రేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరునాలలో దుకాణాలు కిక్కిరిసి కనిపించాయి. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు శివశంకర్, సుధాకర్, అర్చకులు మల్లికార్జున, ఆలయ సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు



గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు

రంగనాథస్వామి విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపనకు సోమవారం అంకురార్పణ చేశారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి మార్గదర్శనంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్రాల రమాకాంతాచార్యస్వామి పాంచరాత్రాగమానుసార సన్నాహక దీక్షతో అంకురార్పణ చేశారు. వేద పండితులు శ్రీమన్నారాయణాచార్యులు, మాధవాచార్యులు, భగవాన్ ఆచార్యులు, రమేష్ ఆచార్యులు, రంగనాథాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ నాగరాజు మాట్లా డుతూ 8వ రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి మార్చి 1వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుపుతామన్నారు.



పూజా కార్యక్రమంలో త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, రుత్వికులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

మహా శివరాత్రి సంబరాలు గ్రామాల్లో సోమవారం కూడా కొనసాగాయి. ఎడ్ల బండ లాగుడు పోటీలు.. యువకుల ఆటల పోటీలతో పల్లెలు మురిసిపోయాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఉల్లాసంగా ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. సాయంత్రం విజేతలను బహుమతులతో సత్కరించారు. – సాక్షి నెట్‌వర్క్



బండను లాగుతున్న ఎద్దులు

- గ్రామాల్లో కొనసాగిని మహాశివరాత్రి సంబరాలు
- ఆటల పోటీలతో అలరించిన పల్లెలు



విజేతలతో ఆలయ కమిటీ సభ్యులు

కబడ్డీ విజేత విజయవాడ

ఓర్వకల్లు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానం పరిధిలో రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలలో విజయవాడ జట్టు విజేతగా నిలిచింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 34 జట్టు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు సోమవారం సాయంత్రం నాకౌట్ పద్ధతిలో మ్యాట్‌పై ఆడించిన పోటీలలో విజయవాడ మిషన్ జట్టు ప్యాపిలి జట్టుపై విజయం సాధించింది. మూడో స్థానంతో కొమరోలు జట్టు సరిపెట్టుకుంది. స్టేడియం చీఫ్ కోచ్ భూపతి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేల నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

భజన పోటీల విజేత మండ్లవానిపల్లె

భజన పోటీలలో బేతంచెర్ల మండలం మండ్లవానిపల్లెకు చెందిన సాయివీరాంజనేయ భజన మండలి బృందం తొలి బహుమతిగా అరతులం బంగారం కైవసం చేసుకోగా కందికాయపల్లెకు చెందిన భ్రమరాంబ భజన బృందం రెండో బహుమతిగా రూ.20 వేలు, కడిమెట్ల శివమారుతి భజన బృందం మూడో బహుమతిగా రూ.15 వేలు గెలుచుకున్నారు. పోటీలకు రామలింగయ్య, తుగ్గలి వెంకటేష్, రంగయ్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కర్నూలు వృషభాలు భళా..

ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దులు బండ లాగుడు పోటీల్లో పాలపళ్ల విభాగంలో కర్నూలుకు చెందిన బైరపోగు సుంకన్న బ్రదర్స్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేలు కై వసం చేసుకున్నాయి. కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన కృష్ణప్రసాద్, పందిర్లపల్లె ఖలీల్‌బాషా వృషభాలు సంయుక్తంగా రెండు బహుమతిని(రూ.20 వేలు), ప్యాపిలి మండలం ధర్మవరం దాసరి నాయుడు వృషభాలు మూడవ బహుమతిని(రూ.10 వేలు), కృష్ణగిరి మండలం అమకతాడు మంగళి మూగన్న వృషభాలు నాలుగో బహుమతిని (రూ.6 వేలు), ఐజ మండలం మేడికొండ సిద్దయ్య వృషభాలు ఐదవ బహుమతిని(రూ.5 వేలు) గెలుచుకున్నాయి.



పోటీలో పాల్గొన్న భజన బృందం

పరుగు వీరుడు నవీన్

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నిర్వహించిన పరుగు పందెంలో 14 మంది యువకులు పోటీ పడ్డారు. సమాధి నాగయ్య గుడి నుంచి వై.కానాపురం వరకు ఏర్పాటు చేసిన పరుగు పందెంలో నవీన్ మొదటి స్థానంలో నిలిచి రూ.3,016 కైవసం చేసుకున్నాడు. రెండవ స్థానంలో దినకర్(రూ.2,016), మూడవ స్థానంలో దస్తగిరి(రూ.1,016), నాలుగవ స్థానంలో వీరంజి (రూ.516) నిలిచారు. అలాగే హైస్కూల్ మైదానంలో నిర్వహించిన స్లో బైక్ రైడింగ్‌లో సైలెంట్ కిల్లర్, మహేంద్ర, శ్రీను మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఎద్దుల బండలాగుడు పోటీలో కొణిదెల మహేష్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో ఆనంద్ వృషభాలు, మూడవ స్థానంలో బోయ హరికృష్ణ, నాలుగవ స్థానంలో తలారి లింగన్న ఎద్దులు నిలిచాయి.



చనుగొండ్లలో పరుగుపందెం విజేతకు నగదును అందిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు దౌల